

కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీ కార్యకర్తలు

అంగన్‌వాడీల కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

- కలెక్టరేట్‌లోకి ఉద్యోగులు వెళ్లకుండా అడ్డుకున్న అంగన్‌వాడీలు
- అంగన్‌వాడీ కార్యకర్తలకు పోలీసులకు మధ్య తోపులాట
- సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ



కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు



అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్దఎత్తున కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టరేట్‌లోకి ఉద్యోగులు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో పోలీసులకు అంగన్‌వాడీలకు మధ్య తోపులాట జరిగింది. ఇందులో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలకు, మహిళా పోలీసులకు గాయాలయ్యాయి. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమపై పోలీసులు దౌర్జన్యంగా అరెస్టు చేశారని అన్నారు. అనేకమార్లు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా అధికారులకు విన్నవించినా సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదన్నారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం నిర్దిష్టమైన హామీ ఇవ్వాలని నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఓవైపు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అంగన్‌వాడీలను నిర్వీర్యం చేయాలని చూస్తుందని తద్వారా అంగన్‌వాడీ ఉద్యోగుల భద్రతకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి, అంగన్‌వాడీల జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్‌బాబు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నన్నే సాబ్, స్వర్ణ, చంద్రకళ, వాణి తదితరులు పాల్గొన్నారు. కాగా, అరెస్టు చేసిన నాయకులను విడుదల చేసేంతవరకూ అంగన్‌వాడీలు కలెక్టరేట్ వద్దే బైఠాయించారు.



నిధులు దక్కేనా?

- నేడే రాష్ట్ర బడ్జెట్
- జిల్లాకు ఆర్థిక కేటాయింపులే ప్రధానం
- పరిష్కారానికి నోచుకోని ప్రధాన సమస్యలు
- నిధుల లేమితో ముందుకు సాగని పలు ప్రాజెక్టులు
- నిధుల కేటాయింపుపై జిల్లా వాసుల ఆశలు
- నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక శాఖ మంత్రి భట్టివిక్రమార్క

నిజామాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై జిల్లా వాసులు ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి భట్టివిక్రమార్క ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో జిల్లాకు నిధులు దక్కేనా? అని చర్చించుకుంటున్నారు. కీలకమైన అభివృద్ధి పనులకు నిధులు వస్తాయని అంచనాకు వస్తున్నారు. కొనసాగుతున్న ప్రాజెక్టులతోపాటు ఇతర పనులకు బడ్జెట్‌లో ఈదఫా ఎక్కువ నిధులు వస్తాయని భావిస్తున్నారు. జిల్లాలో కొత్తగా ఇంజనీరింగ్, వ్యవసాయ కళాశాలల ఏర్పాటుపై కూడా బడ్జెట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని జిల్లా ప్రజలు ఆశతో చూస్తున్నారు. ఉన్న విశ్వవిద్యాలయంతో పాటు మెడికల్ కళాశాలకు అత్యధికంగా ఈ దఫా నిధులు వస్తాయని అంచనాకు వస్తున్నారు. సంక్షేమానికి ఈ దఫా ఎక్కువ నిధులు కేటాయించే అవకాశం ఉండడంతో జిల్లా వాసులు ఈ బడ్జెట్ కోసం ఎదురు చూస్తున్నారు.

ఉభయ సభల్లో ప్రవేశ పెట్టనున్న బడ్జెట్

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉభయ సభల్లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆధ్వర్యంలో ఈ బడ్జెట్‌ను ప్రకటించనున్నారు. ప్రభుత్వం కీలకరంగాలకు, హామీలకు నిధులను కేటాయించే అవకాశం ఉంది. జిల్లాలో ఉమ్మడి రాష్ట్ర హయాంలో చేపట్టిన కాళేశ్వరం ప్యాకేజీ పనులు ఇప్పటికీ సాగుతూనే ఉన్నాయి. నిధుల కేటాయింపు లేకపోవడం వల్ల నామమాత్రంగా పనులు కొనసాగుతున్నాయి. కొన్ని నిధులు విడుదల చేస్తే 50వేల ఎకరాలకు సాగునీరు వచ్చే అవకాశం ఉండడంతో ఈ బడ్జెట్‌లో ప్రతిపాదిస్తారని జిల్లా రైతులు ఎదురుచూస్తున్నారు. మంచిప్ప రిజర్వాయర్‌తో పాటు నిజాంసాగర్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఎత్తిపోతల పథకాలకు కూడా నిధులు కేటాయించనున్నారు. రైతు భరోసా, రుణమాఫీ, సబ్సిడీ పై యాంత్రీకరణ, పసుపు, ధాన్యం కొనుగోలుపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో అత్యధికంగా వరిసాగవుతుండడం వల్ల కొనుగోలుకు నిధులు కేటాయిస్తారని, బోనస్ కూడా నిధులు ప్రకటిస్తారని రైతులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో మెట్టప్రాంతాల్లో ఎండిపోతున్న పంటలపై ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. ఇరవైఏళ్లుగా జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల, వ్యవసాయ కళాశాలలు ఏర్పాటు చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు. గత రెండేళ్లుగా జిల్లా యంత్రాంగం తరఫున ప్రతిపాదనలు కూడా పంపించారు. ఈ బడ్జెట్ సందర్భంగా కొత్త కళాశాలలను ప్రకటించే అవకాశం ఉందని అంచనాకు వస్తున్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయం నిధుల కొరతను ఎదుర్కొంటుంది. ఈదఫా బడ్జెట్‌లో విశ్వవిద్యాలయానికి అధిక నిధులు వస్తాయని భావిస్తున్నారు. జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ మెడికల్ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రజాప్రతినిదులు ఇచ్చిన సిఫారసు ప్రకారం నిధులు కేటాయిస్తారని భావిస్తున్నారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీపై కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని అంచనాకు వస్తున్నారు. రోడ్లు, ప్రభుత్వ భవనాల నిర్మాణం, పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీల బిల్లులు, రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉందని అంచనాకు వస్తున్నారు. బడ్జెట్‌కు రెండు రోజుల ముందే జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కీలక అంశా లపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ పథకాలపైన ఫోకస్ పెట్టడంతో నిధులు ఎక్కువగా కేటాయించే అవకాశం ఉందని జిల్లా వాసులు భావిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రెండోసారి ప్రవేశపెడుతు న్న ఈ బడ్జెట్‌లో జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు ఉండవచ్చని జిల్లా ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ మద్దతు

అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



సుభాష్‌నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ మొదటి నుంచి సంపూర్ణ మద్దతు తెలుపుతుందని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదిగల సామాజిక, ఆర్థిక పరిస్థితులపూ పూర్తి అవగాహన ఉన్న నాయకుడిగా కేసీఆర్ వర్గీకరణ అంశానికి మొదటి నుంచి సంపూర్ణ మద్దతు తెలిపారన్నారు. మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగా చూసే కొన్ని రాజకీయ పార్టీల అవకాశావాదానికి భిన్నంగా ఉద్యమం నుంచి నేటి వరకు వర్గీకరణ అంశంలో మద్దతు అందించారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని స్వయంగా కలిసి తీర్మాన కాపీలను అందజేసి రాజ్యాంగ సవరణ చేయాలని కోరారని గుర్తుచేశారు.

జిల్లా సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యే ధన్‌పాల్



అసెంబ్లీ సమావేశాల్లో అర్బన్ ఎమ్మెల్యే జిల్లా సమస్యలపై గళం వినిపించారు. అర్బన్ నియోజకవర్గంలో సుమారు 50వేల మంది ఇందిరమ్మ ఇళ్ల పథకానికి దరఖాస్తు చేసుకున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం దసరా, దీపావళి అంటూ కాలయాపన చేస్తుందన్నారు. నాగారంలో, కలెక్టరేట్ బైపాస్ రోడ్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌ల ఇళ్లు శిథిలావస్థకు చేరాయన్నారు. నిజామాబాద్ నగర ప్రధాన బస్టాండ్‌లో మౌలిక సదుపాయలు లేవని బస్టాండ్ అభివృద్ధికి ప్రభుత్వం చొరవతీసుకోవాలన్నారు. ఐటీ హబ్‌లో కేవలం 9 కంపెనీలే పనిచేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హనీమూన్ పీరియడ్ అయిపోయిందని ఇప్పటికైనా తెలంగాణ యువత కోసం ఆలోచించాలన్నారు.



జైతాపూర్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఎడపల్లి, మార్చి18 (ఆంధ్రజ్యోతి): మండలంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. మండలంలోని జైతాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎంతమందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని ఆరా తీశారు. గ్రామంలో మొత్తం 128 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వారిలో 25 మంది ఇళ్ల నిర్మాణాలను చేపట్టారని అధికారులు తెలిపారు. మిగతా లబ్ధిదారులు కూడా వెంటనే నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. గ్రామ సభల ద్వారా అర్హులైన వారిని గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామన్నారు. అనంతరం ఎడపల్లి గ్రామ శివారులోగల బాలికల గురుకుల పాఠశాల/కళాశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగదిని, డైనింగ్ హాలును, స్టోర్ రూంను సందర్శించి అందులోగల బియ్యం, కూరగాయలు, పప్పు దినుసులు, వంట నూనె, ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు. కలెక్టర్ వెంట గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ, తహసీల్దార్ ధన్వాల్, ఎంపీడీవో శంకర్, జైతాపూర్ గ్రామ పంచాయితీ కార్యదర్శి నాగేష్ తదితరులు ఉన్నారు.



గురుకులంలో అన్నాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



డీసీసీ అధ్యక్షుడి ఎంపికకు కసరత్తు

- ఈ నెలాఖరులోపు ఎంపిక చేయనున్న కాంగ్రెస్ అధిష్ఠానం
- ఇప్పటికే పలు వర్గాల నుంచి పదవి కోసం ప్రయత్నాలు
- బలమైన నేతకే డీసీసీ పీఠాన్ని కట్టబెట్టే అవకాశం

నిజామాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రస్థాయిలో కీలక పదవులను భర్తీ చేసిన కాంగ్రెస్ అధిష్ఠానం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను నియమించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నెలాఖరులోపు భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుల పదవీ కాలం పూర్తికావడం ఎక్కువ మందికి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్‌లు ఇవ్వడంతో కొత్తవారిని నియమించనున్నారు. రాష్ట్రస్థాయిలో అన్ని జిల్లాలను పరిశీలించి రాజకీయ సమీకరణాల ప్రకారం ఈ పదవులను భర్తీ చేయనున్నారు. వచ్చేది స్థానిక సంస్థల ఎన్నికలు కావడం వల్ల కీలకమైన వ్యక్తులనే ఈ దఫా నియమించేందుకు పార్టీ నేతలు నిర్ణయించినట్లు తెలుస్తోంది. బలమైన సామాజిక వర్గంతో పాట స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలకంగా పని చేసే నేతలకు అవకాశం ఇవ్వనున్నారు. ప్రస్తుతం ఓసీ వర్గానికి చెందిన మానాల మోహన్ రెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న ఆయన స్థానంలో కొత్తవారిని నియమించనున్నారు. జిల్లా నుంచి పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో ఈ పదవిపై బీసీ నేతలు ఆశలు పెట్టుకున్నారు. అయితే రాష్ట్ర అధ్యక్షుడే బీసీ నుంచి ఉండటం వల్ల ఈ దఫా మళ్లీ ఓసీకి కానీ, మైనార్టీకి కానీ ఎస్సీ సామాజిక వర్గం నుంచి కానీ అధ్యక్షుడిని నియమించనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం బట్టి తెలుస్తోంది. వచ్చేది స్థానిక సంస్థలు కావడంతో ఎన్నికలను ప్రభావితం చేయడంతో పాటు బీఆర్ఎస్, బీజేపీ నేతలను సమర్థవంతంగా ఎదుర్కొనే వారికే ఈ అవకాశం ఇవ్వనున్నారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాలు ఉండటం, మూడు పార్టీలు కూడా బలంగా ఉండటంతో కీలకమైన నేతకే అవకాశం ఇవ్వనున్నారు. ఓసీ నుంచి నగేష్‌రెడ్డి, ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. వీరే కాకుండా మరో ఇద్దరు ముగ్గురి పేర్లను పరిశీలించినట్లు సమాచారం. మైనార్టీ, ఎస్సీ సామాజిక వర్గాల నుంచి కూడా కొంత మంది పేర్లను పరిశీలిస్తున్నారు. బీసీ సామాజిక వర్గం నుంచి శేఖర్‌గౌడ్ కూడా అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవిపై దృష్టి పెట్టిన ఆయన అక్కడ అవకాశం రాకుంటే ఈ పదవి ఇవ్వాలని కోరినట్లు తెలుస్తోంది. పార్టీ వెంట ఉండి మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న నగేష్‌రెడ్డి తన ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. బాల్కొండ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన ముత్యాల సునీల్‌రెడ్డి పేరు కూడా పరిశీలిస్తున్నారు. గతంలో అధ్యక్షుడిగా పని చేసిన అనుభవం మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డికి ఉండటంతో ఈ ముగ్గురు పేర్లు తెరమీదకి వస్తున్నాయి. వచ్చేది గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌తో పాటు మున్సిపల్ ఎన్నికలు ఉన్నాయి. వీటన్నింటిని సమర్థవంతంగా జిల్లా అధ్యక్షుడు ఎదుర్కోవాలి. అభ్యర్థుల ఎంపిక నుంచి బీఫామ్‌లు అందించాలి. గ్రామ పంచాయతీ ఎన్నికలను మినహాయిస్తే మిగతావన్నీ పార్టీ గుర్తుపై జరుగుతాయి. వీటన్నింటిపైన దృష్టిపెట్టి పనిచేసేవారికి అవకాశం ఇవ్వనున్నారు. జిల్లాస్థాయిలో ప్రస్తుతం ఎమ్మెల్యేలు లేనిచోట గ్రూప్‌లు ఎక్కువగా ఉన్నాయి. నిజామాబాద్ అర్బన్, బాన్సువాడ, బాల్కొండ, ఆర్మూర్‌లో ఈ వర్గాలు కొనసాగుతున్నాయి. అక్కడ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఎమ్మెల్యేలు పోటీ చేసిన వారు ఉన్నా ఇతర నేతల నుంచి అసమ్మతి పెరుగుతోంది. కొన్ని నియోజకవర్గాల్లో ఎవరికి వారే గ్రూపులను మెయిన్‌టెన్ చేస్తూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వీటన్నింటిని సమన్వయంతో చూడటంతో పాటు కలుపుకొనిపోయే నేతకు అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. డీసీసీ అధ్యక్ష పదవితో పాటు నిజామాబాద్ అర్బన్ అధ్యక్ష పదవిని కూడా భర్తీ చేయనున్నారు. నిజామాబాద్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా కేశవేణు పదేళ్లకు పైగా కొనసాగుతున్నారు. ఆయన ప్రస్తుతం నుడా చైర్మన్‌గా పనిచేస్తున్నారు. ఆయన స్థానంలో కొత్త వారికి అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు పోస్టులను ఒకేదఫా ఎంపిక చేయనున్నారు. ఈ నెలాఖరులోపు భర్తీ చేయనుండటంతో పార్టీకి చెందిన నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. బీసీ సామాజిక వర్గం నుంచి కూడా తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. జిల్లా అధ్యక్ష పదవి భర్తీ చేసిన తర్వాత పార్టీ పదవులన్నీ భర్తీ చేయనున్నారు.

పసుపు ఉత్పత్తిని పెంచేలా బోర్డు చర్యలు

- జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి



మాట్లాడుతున్న జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి

సుభాష్‌నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పసుపు ఉత్పత్తిని పెంచే విధంగా బోర్డు చర్యలు చేపడుతుందని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన జాతీయ స్పైసెస్ టర్మరిక్ అమ్మకందారులు, కొనుగోలు దారులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 7లక్షల ఎకరాల్లో పసుపు సాగవుతుందని దేశంలో 27 రాష్ట్రాల్లో పసుపు పంటను పండిస్తున్నారని అన్నారు. రెండు సంవత్సరాల్లో పసుపు రేట్లు తగ్గాయని ఉత్పత్తి తగ్గడం వల్లే పసుపు రేట్లు పెరిగాయని అన్నారు. దేశంలో ఎక్కడ పసుపు ధరపై ఆందోళనలు జరగడం లేదని జిల్లాలోనే ఎందుకు జరుగుతున్నాయని ప్రజలు ఆలోచన చేయాలన్నారు. రైతు సంక్షేమం కోసం పసుపు బోర్డు పనిచేస్తుందన్నారు. పసుపు ద్వారా జిల్లా మార్కెట్ కమిటీకి సంవత్సరానికి 10 నుంచి 15 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. పసుపు బోర్డు మరింత పనిచేయడానికి కొంత సమయం పడుతుందని అన్నారు. స్పైసెస్ బోర్డుతో ఇప్పుడే విడిపోయామని ఉద్యోగ విభజన కోసం కొంత సమయం పడుతుందని సహకరించాలని కోరారు. రానున్న రోజుల్లో ఆదర్శవంతంగా బోర్డు పనిచేస్తూ ముందుకు వెళ్తుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఒకే వెరైటీ వంగడాన్ని రైతులు పండిస్తున్నారని శాస్త్రవేత్తలు కరిక్యూరియం ఎక్కువ వచ్చే వంగడాలను జిల్లా రైతులకు అందించాలని కోరారు. 2030 వరకు 60వేల మెట్రిక్ టన్నులను ఎగుమతులను టార్గెట్‌గా పెట్టుకొని ఉన్నామన్నారు. త్వరలో దేశంలోని అన్ని రాష్ట్రాల ఉద్యానవన శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పసుపు మార్కెటింగ్ చేయడానికి బోర్డు సహకరిస్తుందన్నారు. అనంతరం జాతీయ పసుపు బోర్డు కార్యదర్శి భవానిశ్రీ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంగా త్వరలో కార్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ స్పైసెస్ బోర్డు సెక్రెటరీ రేమాశ్రీ, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న బోర్డు సభ్యులు

వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళన



కోటగిరిలో వినతిపత్రం సమర్పిస్తున్న మైనారిటీ నాయకులు

కోటగిరి,మార్చి18(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలో మైనారిటీ నాయకులు వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో మంగళవారం నిరసన తెలిపారు. వక్ఫ్‌బోర్డును యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డుకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉప తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు ఖలీల్, వహీద్, అయుబ్,జుబేర్‌ఖాన్,ఫెరోజ్, హజర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ పెంచడం చారిత్రాత్మకం



కోటగిరిలో స్వీట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోటగిరి,మార్చి18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ 42శాతం పెంచడం చారిత్రాత్మకమని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడంతో కాంగ్రెస్ నాయకులు కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద బాణాసంచాలు కాలుస్తూ స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ బీసీలకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి మద్దతు ఇస్తుందన్నారు. కుల గణన సర్వే చేయడంతో పాటు బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ తీసుకొచ్చిన బిల్లు శాసన సభలో ఏకగ్రీవంగా ఆమోదించడం హర్షనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులుకొట్టం మనోహర్, బర్ల మధు, తయ్యబ్, శంకర్, రాజయ్య, సుదర్శన్, అబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

9వ రోజు ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్షలు

ఆర్మూర్‌టౌన్, మార్చి18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తొమ్మిదవ రోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జీ మైలారం బాలు మాట్లాడుతూ 75ఏళ్లుగా మాదిగ, మాదిగ ఉపకులాల తీవ్రం గా నష్టపోయామని, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఏలాంటి లోపా లు లేకుండా వర్గీకరణ బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చేవురి శ్యామ్, నూత్‌పల్లి సంతోష్, మైలారం రాము, మార్క్, తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: చందూర్ మండల కేంద్రంలో మంగళవారం 8వ రోజు ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన దీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చందూర్ మండల ఎమ్మార్పీఎస్ నాయకులుపాల్గొన్నారు.

సిరికొండ: మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ల కల్పించాలనే డిమాండ్‌తోరిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులకు సిరికొండలో బీజేపీ నాయకులు మద్దతు ప్రకటించారు.ఈకార్యక్రమంలో బీజేపీ మండల , జిల్లా నాయకులు రాజేశ్వర్,రామస్వామి రాజేశ్వర్‌రెడ్డి, గంగారెడ్డి, ప్రభాకర్,రంజిత్‌రెడ్డి, బాబురావు, అజయ్ తదితరులు పాల్గొనగా ఎంఆర్‌పీఎస్ మండల దీపక్ దీక్షలు చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

రెంజల్,మార్చి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోర్గాం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగభూషణం రెడ్డిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు కార్తీక్, మాజీ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, ఓబీసీ మండల అధ్యక్షుడు నితిన్, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ మొయినోద్దీన్, సాయిబాబా గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గైని కిరణ్, సోషల్ మీడియా జిల్లా మాజీ కన్వీనర్ అబ్బోళ్ల శ్రీకాంత్, సిద్ద సాయిలు, మేక సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఔషదాల ఆవిష్కరణ ఆవశక్యతపై అవగాహన

ఆర్మూర్‌టౌన్, మార్చి18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఔషదాల ఆవిష్కరణ ఆవశ్యకతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ కెమిస్ట్రి డిపార్ట్‌మెంట్ డాక్టర్ జి.బాలకిషన్, కళాశాల ప్రిన్సిపాల్ వై.వేణుప్రసాద్, డాక్టర్ ఎం.సునీత,డాక్టర్‌జాన్‌సుకుమార్, అధ్యాపకులు, పాల్గొన్నారు.

కందకుర్తి స్మృతి మందిరం సందర్శన

రెంజల్,మార్చి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందకుర్తి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కేశవ స్మృతి మందిరాన్ని మంగళవారం ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్‌జీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారితో కలిసి సందర్శించారు. ఆయన వెంట బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీ నర్సయ్య, మండల అధ్యక్షుడు గోపికృష్ణ, మేక సంతోష్, ఈర్ల రాజు, పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లిలో మైనారిటీ సోదరులకు ఇఫ్తార్ విందు

జక్రాన్‌పల్లి, మార్చి18(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండగ సందర్భంగా జక్రాన్‌పల్లిలో మైనారిటీ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఇఫ్తార్‌విందును ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్‌విందులో మైనారిటీ సోదరులు పాల్గొని ఇఫ్తార్ విందులో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్‌సభ్యుడు అక్బర్‌ఖాన్, మైనారిటీ సదర్ నియమత్‌అలీ, హీమం,ముస్లీంలు పాల్గొన్నారు.

యువమోర్చా అధ్యక్షుడిగా నవీన్

నందిపేట, మార్చి18(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ నందిపేట మండల యువమోర్చ అధ్యక్షుడిగా మంగ్లారపు నవీన్ ఎన్నికయ్యారు. మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామానికి చెందిన మంగ్లారం నవీన్ సోషల్ మీడియా కార్యదర్శిగా చురుకుగా పని చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చ అధ్యక్షుడు గడ్డం చిన్నారెడ్డి, దమ్మాయి సుదాకర్, గంగాధర్‌గౌడ్, నరేందర్, నవీన్, శ్రీనివాస్‌గౌడ్,ఉన్నారు.

ఆస్తి తగాదా కేసులో ఇద్దరికి రూ.10వేల జరిమానా

నందిపేట, మార్చి18(ఆంధ్రజ్యోతి): నందిపేట మండలంలోని కుద్వాన్‌పూర్ గ్రామానికి చెందిన గోజూరు పోశెట్టి, గోజూరు గంగాదర్‌లకు ఆస్తి తగద కేసులో మంగళవారం ఆర్మూర్ ప్రధానశ్రేణి న్యాయమూర్తి వేముల దీప్తి ఇద్దరు నేరస్థులకు రూ10వేల చొప్పున జరిమానా విధించినట్టు ఎస్సై ఎన్.చిరంజీవి తెలిపారు. ఆస్తి తగద కేసులో చాకచక్యంగా వ్యవహారించిన కానిస్టేబుల్ దేవలింగంను, ఏపీపీ రామకృష్ణలను అభినందించినట్టు ఎస్సై ఎన్.చిరంజీవి తెలిపారు.

గ్రామస్థుల అనుమతి లేకుండా పనులను ఎలా చేస్తారు

మోస్రా,మార్చి18(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రానికి ఎంజీఆర్‌ఈఏస్ ద్వారా కేంద్ర నిధులు మంజూరైన నిధులు గ్రామంలో ఎక్కడెక్కడ అవసరమున్న చోట సీసీ రోడ్లు వేయడానికి నాణ్యతతో వేయటానికి గ్రామస్థుల సహకారంతో తీర్మానించి పనులు చేయటానికి గ్రామస్థులు సిద్ధంగా ఉండగా గ్రామస్థులు. చేసిన తీర్మానాన్ని ఉల్లంఘించి పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్గానికి చెందిన కొందరు కావాలని వేరే మండలానికి చెందిన వ్యక్తికి పనులు అప్పగించడం హాస్యాస్పదంగా ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు.

అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

● డీఎం అండ్ హెచ్‌వో రాజశ్రీ



మామిడిపల్లిలోని బస్తీ దావాఖానల్లో రిజిష్ట్రర్‌లను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో



బినోల పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

ఆర్మూర్‌టౌన్,మార్చి18(ఆంధ్రజ్యోతి):వైద్యశాఖ అధికారులు, సిబ్బం ది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డీఎంఅండ్ హెచ్‌వో రాజశ్రీ అన్నా రు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని మా మిడిపల్లి బస్తీ దావాఖానను డీఎం అండ్‌హెచ్‌వో రాజశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు.వైద్యాధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్యాన్ని అందించాలని ఏమైన ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అని సూచించారు. అనంతరం బస్తీ దావాఖానాలోని రిజిష్ట్రర్, రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని బినోల పీహెచ్‌సీని మంగళవారం డీఎంహెచ్‌వో రాజశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో కేవలం ఇద్దరు స్టాఫ్ నర్సు, సిబ్బంది ఉండడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో ఓపీ కేసుల సంఖ్యను పెంచాలని, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రిలో అన్నిరకాలమందులను అందుబాటులో ఉంచాలని సిబ్బందినిఆదేశించారు. ఆసుపత్రిలో అమ్మఒడి కార్యక్రమం నిర్వహించకపోవడం పట్లఅసంతృప్తి వ్యక్తం చేశారు.ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బందితో పాటు వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు.ఆసుపత్రిలో పలు రికార్డులను పరిశీలించారు.

● వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన: సులోచన

ఆర్మూర్‌టౌన్: ఎండకాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యశాఖ జిల్లా హెల్త్ ఎడ్యూకేటర్ స్వామి సులోచన విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. మంగళవారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో యుపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె హాజరై మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ఒత్తిడికి గురికావద్దని, వ్యక్తిగత పరిశుభ్రత, సంక్రమిత వ్యాధుల గురించి విద్యార్థినిలకు ఆమె అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, పాఠశాల హెచ్‌ఎం వనజారెడ్డి, ఎఎన్ఎం, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌రూరల్, మార్చి18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మహిళా ప్రాంగణంలో గల మహాత్మజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం మున్సిపల్ కమిషర్ రాజు పరిశీలించారు. వేసవికాలంలో విద్యార్థినిల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నాణ్యతతో కూడిన సరుకులు తీసుకొని రుచికరమైన భోజనాన్ని విద్యార్థినిలకు అందజేయాలని ప్రిన్సిపాల్ సృజనకు సూచించారు. అనంతరం అటెండెన్స్ రిజిష్ట్రర్, వంట గదిలోని కూరగాయలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ గజానంద్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ రాజు

● ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి

ఆర్మూర్‌టౌన్: వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతీ హెల్త్ సెంటర్‌లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. మంగళవారం పట్టణంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ బస్తీ దావఖానను ఆయన సందర్శించారు. డయేరియా, తదితర వాటికి సంబంధించిన మందులు అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. అలాగే రక్త పరీక్షలకు వచ్చిన రోగి వివరాలను అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ సానిటరీ ఇన్స్‌పెక్టర్ గజానంద్, అధికారులు, తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి కొనుగోలు కేంద్రాలు

వర్ని,మార్చి18(ఆంధ్రజ్యోతి):వర్నిమండలంలో గురువారం నుంచి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వర్ని విండో చైర్మన్ నామాల సాయిబాబా తెలిపారు.రైతులు ఆరుగాలం శ్రమించిపండించిన పంటను దళారులపాలు చేసి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని ఆయన కోరారు.ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కృషితో అన్నదాతలకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాట్ కబ్జాకు గురైందని నిరసన

ఆర్మూర్‌టౌన్, మార్చి18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్‌కాలనీలో తమ ప్లాటు కబ్జాకు గురైందని కుటుంబసభ్యులు టెంటు వేసుకొని నిరసన తెలిపారు. గత సంవత్సరం మున్సిపల్ కార్యాలయంలో లే అవుట్ నెంబర్ 388/83లోని 74, 89వ నెంబర్ ప్లాట్లను కబ్జాదారులు కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో తమ ప్లాట్‌లో టెంట్ వేసి నిరసన చేస్తున్నామని భూ బాధితులు జెస్సు అనిల్‌తో పాటు వారి కుటుంబసభ్యులకు తెలిపారు.

చెత్తను కాల్చొద్దని పంచాయతీ అధికారికి వినతి

వర్ని,మార్చి18(ఆంధ్రజ్యోతి): వర్ని మండలంలోని సత్యనారాయణ పురం గ్రామంలోని డంపింగ్ యార్డ్ సమస్యలపై గ్రామస్థులు మంగళవారం పంచాయతీ అధికారికి వినతిపత్రం సమర్పించారు. చెత్తను కాల్చకుండా సక్రమంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దామినేని నాగేశ్వర్ రావు, నామాల జానకి రామయ్య, సత్యనారాయణ, గుళ్లపల్లి వెంకన్న, రామావత్ నరేష్, మీరాబాయ్, ఓంకార్, యోహాను, సాయిబాబు, మార్ని రాజేష్, కంది పోశెట్టి, విఠల్, సురేష్, మాలిపటేల్ ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవీపేట మేకల సంత వేలం రూ.61లక్షల 31వేలు

● గత సంవత్సరం కంటే జీపీకి రూ.20లక్షల 81వేల అదనపు ఆదాయం

నవీపేట,మార్చి18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన నవీపేటలో ప్రతి శనివారం జరిగే మేకల సంతకు మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో 61.31లక్షలకు నవీపేటకు చెందిన రియాజ్ హైమద్ సంతను వేలంపాట ద్వారా దక్కించుకున్నాడు. ఈ వేలంపాటలో 105మంది ఒక్కొక్కరు లక్ష రూపాయల చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. గత సంవత్సరం మేకల సంత వేలం పాట 40.50లక్షలకు పలికింది. ఈ సంవత్సరం గ్రామ పంచాయతీకి మేకల సంత ద్వారా 20.81లక్షల అదనపు ఆదాయం సమకూరనుంది. అలాగే ప్రతి శుక్రవారం జరిగే వారాంతపు సంతకు 17మంది లక్ష రూపాయల చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. ఇందులో నవీపేటకు చెందిన డీ.సతీష్ 14.01లక్షలకు వారాంతపు సంతకు దక్కించుకున్నాడు. గత సంవత్సరం వారాంతపు సంత కేవలం 5 లక్షల కు మాత్రమే వేలంపాట పలికింది. ఈ సంవత్సరం వారాంతపు సంత ద్వారా 9.01లక్షల అదనపు ఆదాయం గ్రామ పంచాయతీకి సమకూరనుంది. సులభ్ కాంప్లెక్స్ నిర్వహణకు వేలంపాట నిర్వహించగా అప్‌సెట్ ధర రాకపోవడంతో వేలంపాటను వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఎస్‌ఐ వినయ్ ఆధ్వర్యంలో వేలంపాట కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెద్ద కొడప్‌గల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శనగ కొనుగోలు కేంద్రాన్ని అధ్యక్షులు హన్మంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు హన్మంత్ రెడ్డి మట్లాడుతు ర బీ సీజన్‌లో రైతులు తాము పండించిన పంటకు గిట్టుబాటు కల్పించాలనే ఉద్దేశ్యంతో శనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. రైతులు తాము పండించిన పంటను దళారులకు అమ్మకుండ నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి అమ్ముకోవాలని సూచించారు. ప్రభుత్వం శనగకు క్వింటాలుకు రూపాయలు 5650 గా నిర్ణయించడం జరిగిందని, ఒక ఎకరానికి 6.29 క్వింటాళ్ల శనగలకు అమ్ముకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షులు సంగారెడ్డి, డైరెక్టర్ నాగి రెడ్డి, సిఈవో సందీప్ కుమార్, ఏఈవోలు రూప, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

మద్నూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించిన ప్రభుత్వం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అందత్వ నివారణ, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గంగా కిషోర్, ప్రముఖ పద్యకవి వెంకట్, వైద్యసిబ్బంది లావణ్య, జ్యోతి, శివకళ పాల్గొన్నారు.

తల్వేదలో 20న ఇసుక వేలం

నందిపేట, మార్చి18(ఆంధ్రజ్యోతి): నందిపేట మండలంలోని తల్వేద గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 120ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకకు ఈనెల 20న బహిరంగ వేలం వేస్తున్నట్టు మండల తహసీల్దార్ ఆనంద్ తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు రూ.20వేల దరవత్తు చెల్లించాలని, ఇసుక వేలం పూర్తయిన తర్వాత మొత్తం డబ్బులు చెల్లించి ఇసుకను సరఫరా చేసుకోవాలని సూచించారు.ఈనెల 20న తల్వేద గ్రామపంచాయతీలో ఉదయం 11గంటలకు వేలం పాట జరుగుతుందని, వేలంలో పాల్గొనే వారు ఇసుకను ముందుగానే పరిశీలించుకోవచ్చని అధికారులు సూచించారు.

పుత్‌పాత్ అక్రమణల తొలగింపు

నిజామాబాద్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ ఆధ్వర్యంలో మంగళవారం నిజామాబాద్ నగరంలో దేవీ రోడ్డు మరియు రైల్వే స్టేషన్ రోడ్డులో ఫుట్‌పాత్ లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలను ట్రాఫిక్ ఏసీపీ, ట్రాఫిక్ సిబ్బందితో కలిసి అక్రమాణలను తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయాలు కలగకుండా చేశారు.

విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలి

వేల్పూర్, మార్చి18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్సహంగా ఉల్లాసంగా ఇష్టపడి చదువుతూ పరీక్షలు రాయాలని, పరీక్షలంటే ముందుగా భయం విడాలని వేల్పూర్, మోతె పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజన్న, వైద్య గణేష్‌లు సూచించారు. మంగళవారం వేల్పూర్, మోతె పాఠశాలల్లో 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు విడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మోతెలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్‌క్లబ్ రిజినల్ చైర్మన్ మాదరి రాజన్న హాజరై పదో తరగతి రాసే విద్యార్థులకు పరీక్షలు రాసే ముందు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అన్నపూర్ణ ట్రస్ట్ నుంచి మంచి పారితోషికం అందజేస్తామని ట్రస్ట్ చైర్మన్ రాజన్న తెలిపారు.ఈ కార్యక్రమంలో వీడీసీ స్పీకర్, పీఆర్‌టీయూ నాయకులు దేవానందం, శైలజ, శర్మ, గంగాధర్, అనిత రాణి, ఉపాధ్యా యులు కృష్ణవేణి, గణేష్, మహేందర్, రత్నం, ప్రవణశ్రీ, కవిత, సురేష్, పాల్గొన్నారు.

కుకునూర్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల వితరణ

వేల్పూర్ మండలం కుకునూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న పఠాని గంగాధర్ పదోతరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం హరిచరణ్, ఉపాధ్యాయులు శ్రీధర్‌రావు, మల్కన్న, నాగరాజు, రవీందర్, అశోక్, చరణ్‌దాస్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

● ధర్మారావుపేట పాఠశాలలో వీడ్కోల్ సమావేశం

సదాశివనగర్: మండలంలోని ధర్మారావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోల్ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఈవో యోసప్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలని ఉపాధ్యాయుల సలహాలు, సూచనలతో ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు,గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. గ్రామానికి చెందిన సామల అరుణ్‌కుమార్ ఆర్థికసహాయంతో పరీక్ష అట్టలు,హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో అందించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో



మోతెలో వీడ్కోల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం వైద్యగణేష్

కల్వరాల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్, బొంపల్లి హెడ్మాస్టర్ కోటేశ్వర్‌రావు, ఉపాధ్యాయబృందం నరేందర్, నిత్యజీవలత, జాస్మిన్, దయానంద్, అన్వర్,జయపాల్‌రెడ్డి, స్వామి,రాజు, సుగుణ,తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్:ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అన్నపూర్ణ స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. . 10జీపీఏ సాధించిన విద్యార్థులకు ట్రస్ట్ తరఫున ప్రోత్సహక బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిప్రిలో:మండలంలోని పిప్రి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు రజనీష్‌కిరాడ్ మంగళవారం పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విశ్వనాథ్, రోటరీ కార్యదర్శి రాస ఆనంద్, కోశాధికారి శశిధర్, ప్రవీణ్‌పవార్, రాధకిషన్, లక్ష్మీనారాయణ, తులసీ, ఖాందేశ్ సత్యంలు పాల్గొన్నారు.

డొంకేశ్వర్:మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదోతరగతి విద్యార్థులకు విడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్, సదానంద్,పాల్గొన్నారు.

తొండాకూర్: డొంకేశ్వర్ మండలం తొండాకూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతికి చెందిన 56మంది విద్యార్థులకు మంగళవారం అదే గ్రామానికి చెందిన గోదాల స్వామి పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లింగారెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో హుండీ లెక్కింపు

బోధన్‌రూరల్,మార్చి18(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో ఏకచక్రేశ్వరాలయంలో మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.3లక్షల 2వేల 990 ఆదాయం సమకూరిందని దేవాదాయ శాఖ ఇన్స్‌స్పెక్టర్ కమల, ఈవో రాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, హనుమాన్ మందిరం కమిటీ చైర్మన్ గుండెటి శంకర్, వేద పండితులు గణేష్ మహరాజ్, ప్రవీణ్ మహరాజ్, మహేష్ మహరాజ్, మధుసూదన్, సుధాకర్‌లతో ధర్మకర్తలు బోదు శేఖర్, గుంత శంకర్, కమల భూమేష్, సింగం లక్ష్మణ్‌లతో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలి

బీర్కూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): హరితహారం కార్యక్రమంలో భాగంగా వచ్చే వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు వీలుగా మొక్కలు సిద్ధం చేసి ఉంచాలని మండల స్పెషల్ ఆఫీసర్ అనీల్ కుమార్ ఉపాధి హామి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన ఎంపిడిఓ భాను ప్రకాష్‌తో కలిసి తిమ్మాపూర్ గ్రామంలో పర్యటించారు. గ్రామ శివారులో ఏర్పాటు చేసిన హరితహారం నర్సరీ, కంపోస్టు షెడ్, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపిడిఓ భాను ప్రకాష్, జీ పీ కార్యదర్శి నవీన్, ఉపాధి సిబ్బంది తదితరులు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి జాలరి మృతి

భీమ్‌గల్‌రూరల్, మార్చి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దపల్లి గ్రామంలో తోపారం బోర్రన్న (49) అనే వ్యక్తి మంగళవారం గ్రామంలోని చెరువులో చేపలు పట్టడానికి వెళ్ళి చేపల కోసం వేసిన వల కళ్ళకు చుట్టుకొని నీటిలో మునిగి ఊపిరి అడక మృతి చెందినట్టు భీమ్‌గల్ ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు ప్రతీరోజు చేపలు పట్టి అమ్ముకొని జీవనోపాధిని సాగిస్తున్నాడు. మృతుడికి వివాహం కాలేదు. అతని సోదరి ఎల్లాల సిద్దపల్లి లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై మహేష్ తెలిపారు.

సైన్స్ ల్యాబ్ పరికరాల అందజేత



బాల్కొండ పాఠశాలకు సైన్స్ ల్యాబ్ పరికరాల అందజేస్తున్న ఎంఈవో

ముప్కాల్, మార్చి18(ఆంధ్రజ్యోతి): పీఎం శ్రీయోజన పథకం కింద మంజూరైనా రూ.6లక్షల విలువైన సైన్స్ ల్యాబ్ పరికరాలను మంగళవారం జిల్లా పాఠశాలకు ఎంఈవో బట్టు రాజేశ్వర్ అందజేశారు. పాఠశాలలో సైన్స్ ల్యాబ్ కోసం ఒక్కో పాఠశాలకు రూ.16లక్షలు మంజూరయ్యాయని, విద్యార్థులను ఇన్నోవేటర్‌గా తీర్చిదిద్దాడం అన్న దర్శనీకతలో అటల్ ఇన్నోవేషియన్ మిషన్ భారతదేశంలో ప్రయోగాత్మకంగా పాఠశాలలో అటల్ ఇంటరింగ్ ల్యాబ్‌రేట రీలను ఏర్పాటు చేస్తుందని ఆయన తెలిపారు.విద్యార్థుల మనస్సులో ఉత్సుకథ, సృజనాత్మకత, డిజైన్ మైండ్‌సెట్, కంప్యూటరేషన్ థింకింగ్, అడప్ట్ లర్నింగ్, ఫిజికల్ కంప్యూటరింగ్ మొదలైన నైపుణ్యాలను పెంపొందించడం, ల్యాబ్‌లు, త్రీడి ప్రింటర్‌లు, రోబోటిక్ ఎలక్ట్రానిక్ టూల్స్, ఎలక్ట్రానిక్ డవలప్‌మెంట్ సెన్సర్స్ మొదలైన ల్యాబ్‌పరికరాలు, సృజనాత్మకతను రేకెత్తించడానికి పాఠ్యాంశాలు, అభ్యాసానికి మించి ముందుకు సాగడానికి రూపొందించ బడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేకల సంతలో సౌకర్యాలు కల్పించాలి



వేలంపాట కేంద్రం వద్ద అధికారులను నిలదీస్తున్న సభ్యులు

నవీపేట,మార్చి18(ఆంధ్రజ్యోతి): నవీపేటలో ప్రతి శనివారం నిర్వహించే మేకల సంతలో సరైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ పలువురు స్థానిక యువకులతో పాటు జిల్లా ఆరె కటికె సంఘం సభ్యులు అధికారులను నిలదీశారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మేకల సంతకు వేలంపాట ప్రారంభిస్తుండగా పలువురు స్థానిక యువకులు, ఆరె కటికె సంఘం సభ్యులు అధికారులను నిలదీశారు. రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నవీపేట మేకల సంతకు రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు మహరాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక తదితర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున మేకల క్రయ, విక్రయదారులు వస్తుంటారని, ప్రస్తుతం సంత నిర్వహిస్తున్న స్థలం ఏ మాత్రం సరిపోవడం లేదని వారు పేర్కొన్నారు. వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందిగా ఉందని ప్రతి వారం సంతకు వచ్చిన వాహనాలు చోరీకి గురవుతున్నాయని, సంతలో కనీస సౌకర్యాలు లేవని వారు ఆరోపించారు. వెంటనే ప్రస్తుతం నిర్వహిస్తున్న సంత స్థలం నుండి గ్రామ శివారులోని మరో ప్రత్యామ్నాయ స్థలంలో మేకల సంతను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. దీంతో కొద్దిసేపు వేలంపాట నిర్వహణ నిలిచిపోగా సంతలో సరైన సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో వేలంపాట యథావిధిగా కొనసాగింది.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఎనమిది మందికి ఒక రోజు జైలు


బోధన్‌రూరల్,మార్చి18(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో మద్యం తాగివాహనం నడిపిస్తున్న 8మందిని సోమవారం గుర్తించి మంగవారం కోర్టులో హజరుపర్చగా న్యాయమూర్తి ఒకరోజు జైలుశిక్ష విధించారని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. పట్టణంలోని ఆజాంగంజ్‌లో పక్క పక్క ఇళ్లగల కుటుంబ సభ్యులు చిన్నచిన్న గొడవలతో పబ్లిక్ న్యూసెన్స్ చేస్తుండగా నలుగురు మహిళలను,ముగ్గురు పురుషులను కూడా కోర్టులో హజరుపర్చగా వారికి కూడాన్యాయమూర్తి ఒకరోజు జైలుశిక్ష విధించారని వివరించారు.

నగరంలో తొమ్మిది మందికి ఒక రోజు జైలు

నిజామాబాద్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఆదేశాల మేరకు నిజామాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించగా 42 మంది పట్టుబడగా వారిని మంగళవారం మార్నింగ్ కోర్టులో హాజరు పర్చగా రెండో క్లాస్ న్యాయాధికారి నూర్జహాన్ బేగం పలు శిక్షలను విధించినట్లు అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ రాజావెంకట్‌రెడ్డి తెలిపారు. వీరిలో 9 మందికి జైలు శిక్ష విధించగా 33 మందికి జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ప్రజలు మద్యం తాగివాహనాలు నడపరాదని వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన పత్రాలను సక్రమంగా ఉంచుకోవాలని ఆయన తెలిపారు.

సకాలంలో రుణాలు చెల్లించి వడ్డీ రాయితీ పొందాలి

మోస్రా,మార్చి18(ఆంధ్రజ్యోతి): మోస్రా మండలంలోని చింతకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జనరల్ బాడీ సమావేశం గుడిపల్లి గంగారెడ్డి అధ్యక్షతన పాలకవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ రైతులు సకాలంలో రైతు రుణాలు కట్టుకుని వడ్డీ రాయితీ పొందాలని సూచించారు. కాల పరిమితి దాటితే అధిక వడ్డీతో రైతులు నష్టపోతారని సకాలంలో రుణాలు చెల్లించి అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. రైతులు వివిధ అంశాలపై తీర్మానాలు చేశారు. రైతు రుణాలు రెండు లక్షల వరకు వెంటనే ఇవ్వాలని, రైతు భరోసా సకాలంలో చెల్లించాలని, గిట్టుబాటు ధరతో పాటురూ. 500 బోనస్ ఇచ్చే అంశాన్ని వెంటనే రైతులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో అశోక్

చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలి: డీఈవో

ఏర్గట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. సోమవారం రాత్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సాంస్కృతిక, కార్యక్రమాలు వారి సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడుతాయని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణచారి, ఎంఈవో ఆనంద్‌రావు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, వీడీసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష

● డీఈవో అశోక్

నిజామాబాద్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మోడల్ స్కూళ్లలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను 6వ తరగతి, 7, 8, 9, 10 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్లు పొందే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 వరకు 6 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్ కొరకు దరఖాస్తులు తీసుకుంటామని పేర్కొన్నారు. ఏప్రిల్ 21 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు. ప్రవేశ పరీక్ష తేదీని ఏప్రిల్ 27వ తేదీకి వాయిదా వేశామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు దరఖాస్తులను తెలంగాణఎంఎస్. సిజిజి.జివోవి.ఇన్ ద్వారా చేసుకోవాలని పేర్కొన్నారు.

ఏఐ తరగతులను పరిశీలించిన ఎంఈవో


భీమ్‌గల్‌రూరల్, మార్చి18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చేంగల్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ల్లో అమలు చేయబడుతున్న ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) కంప్యూటర్ ఆధారిత తరగతులను మంగళవారం మండల విద్యాధికారి స్వామి పరిశీలించారు. ఈ తరగతులు మూడవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు సి గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం తదితర సబ్జెక్టులకు అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన వివరించారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, విజయలక్ష్మీ, గీత, తదితరులు ఉన్నారు.



పొంగిపొర్లుతున్న పోచారం ప్రాజెక్టు (ఫైల్)



పోచారం ప్రాజెక్టులో బోటు షికారు చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు (ఫైల్)



ప్రాజెక్టు అలుగు వద్ద పర్యాటకుల సందడి (ఫైల్)

మారనున్న పోచారం దశ

● ప్రభుత్వ పరిశీలనలో పోచారం ప్రాజెక్టు రిజర్వాయర్ పర్యాటక అంశం ● పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని అసెంబ్లీలో పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటన

● హర్షం వ్యక్తంచేస్తున్న కామారెడ్డి - మెదక్ జిల్లాల ప్రజలు ● ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపిన నియోజకవర్గ ప్రజలు

నాగిరెడ్డిపేట, మార్చి18 (ఆంధ్రజ్యోతి): నిజాం ప్రభుత్వ హయాంలో నిర్మితమైన పోచారం ప్రాజెక్టు రిజర్వాయర్‌కు మంచిరోజులు రానున్నాయి. రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరిచే దిశగా ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కార్ అడుగులు వేస్తోంది. దీంతో ఇక పోచారం ప్రాజెక్టు దశ మారనుందని కామారెడ్డి, మెదక్ జిల్లాల ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పోచారం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరిచేందుకు అన్ని హంగులున్నా గత ప్రభుత్వాలు, పాలకులు దీనిగురించి పట్టించుకోలేదు. ప్రస్తుత ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పోచారం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరిచేందుకు తీవ్రకృషి చేస్తున్నారు. దీనిలో భాగంగానే సోమవారం అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోచారం ప్రాజెక్టు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పర్చాలనే అంశాన్ని సభాముఖంగా ప్రస్తావిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇటీవలే పోచారం ప్రాజెక్టును సందర్శించి వెళ్లిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లికృష్ణారావు అసెంబ్లీలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యేకు సమాధానమిస్తూ పోచారం ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. పోచారం ప్రాజెక్టులో రవాణా, బోటింగ్, పార్కింగ్, చిన్నపిల్లల కోసం ఆట వస్తువుల ఏర్పాటు తదితర అంశాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుందని, పోచారంను పర్యాటకంగా అభివృద్ధి పరుస్తామని మంత్రి తెలిపారు. దీంతో రేవంత్ సర్కార్ హయాంలో పోచారం ప్రాజెక్టు పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందనుందని కామారెడ్డి, మెదక్ జిల్లాల ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమైక్యాంధ్రాలో ఆంధ్ర పాలకుల ఆధ్వర్యంలో నిధుల మంజూరు లోనూ, పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయడంలోనూ పోచారం ప్రాజెక్టుపూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ప్రత్యేక తెలంగాణరాష్ట్రం ఏర్పడితే పోచారం ప్రాజెక్టు దశ మారుతుందని ఈ ప్రాంతం ప్రజలు ఎంతగానో ఆశించారు. కానీ పదేళ్ల అధికారంలో ఉన్నా కేసీఆర్ ప్రభుత్వం పోచారం ప్రాజెక్టును పట్టించుకోలేదు.

నిత్యం పర్యాటకుల సందడి

కామారెడ్డి, మెదక్ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో పోచారం గ్రామం వద్ద పోచారం ప్రాజెక్టు ఉంది. వర్షాకాలంలో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నీటితో నిండితే ప్రాజెక్టు పొంగిపొర్లుతుంది. ప్రాజెక్టు కట్టపై నుంచి అలుగుపారుతున్న నీటి దృశ్యాన్ని చూసేందుకు దూరప్రాంతాల నుంచి పర్యాటకులు ఇక్కడికి తరలివస్తారు. ప్రాజెక్టు పొంగిపొర్లుతున్న సమయంలో ఈప్రాజెక్టు పర్యాటకులతో నిండి ఉంటుంది. కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, హైదరాబాద్ తదితర దూర దూర ప్రదేశాల నుంచి వందలాదిగా పర్యాటకులు తరలిరావడంతో సందర్శకులతో ప్రాజెక్టు ప్రాంతమంతా కిటకిటలాడుతుంది.

● ప్రాజెక్టు మధ్యన అందమైన ఐలాండ్

పోచారం ప్రాజెక్టు మధ్యన అందమైన ఐలాండ్ ఉంది. ప్రాజెక్టులో చుట్టూ నీరుండి ప్రాజెక్టు మధ్యన చిన్న గుట్ట ప్రదేశం ఉంది. కొన్ని ఎకరాల విస్తీర్ణంలో ఈ గుట్ట వ్యాపించి ఉంది. ఈ గుట్ట ప్రదేశం నుంచి చూస్తే చుట్టూ ప్రాజెక్టు నీరు కళకళలాడుతూ ప్రాజెక్టుఅందాలు కనిపిస్తాయి. ఈ ఐలాండ్ ప్రదేశానికి వెళ్లేందుకు ఎలాంటి బోట్ సౌకర్యం లేనందున పర్యాటకు లేవ్వరు ఈ ప్రాంతానికి వెళ్లడం లేదు. ఇటీవల రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పోచారం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన సందర్భంగా హైదరాబాద్ నుంచి టూరిజంశాఖ ద్వారా ప్రత్యేక బోట్‌ను పోచారం ప్రాజెక్టుకు తెప్పించారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, కలెక్టర్ అశిష్ సంగ్వాన్‌తో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు బోటులో షికారు చేస్తూ ఐలాండ్ ప్రాంతం వరకు వెళ్లి వచ్చారు.

● ప్రాజెక్టు పక్కనే పోచారం అభయారణ్యం

పోచారం ప్రాజెక్టు పక్కనే పోచారం అభయారణ్యం ఉంది. వన్యప్రాణి సంరక్షణకేంద్రం ఉంది. ఈ అభయా రణ్యంలో వివిధరకాల వన్యప్రాణులున్నాయి. వన్యప్రాణి సంరక్షణ కేంద్రం వద్ద జింకల ప్రత్యుత్పత్తి కేంద్రం ఉంది. ఇందులో జింకల ప్రత్యుత్పత్తి జరుపుతారు. ఈ పోచారం అభయారణ్యంలో చిరుత పులులు, ఎలుగుబంట్లు, నీల్ గాయ్‌లు, జింకలు, నెమళ్లు, కుందేళ్లు, అడవి పందులు, తదితర రకాల వన్యప్రాణులున్నాయి. పోచారం ప్రాజెక్టు సందర్శనకు వచ్చిన పర్యాటకులందరూ ఈ వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని సందర్శిస్తారు. వన్యప్రాణులను చూసి, ఇక్కడి వాతావరణాన్ని, ఆహ్లాదాన్ని చూసిఎంతగానో ఆనందిసారు. రేవంత్‌రెడ్డి సర్కార్ పోచారం ప్రాజెక్టును వెంటనే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరచాలని ఈ ప్రాంతం ప్రజలు కోరుతున్నారు. పోచారం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా ఏర్పాటుచేసే అంశాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం పట్ల ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేను అభినందిస్తున్నారు. ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



పోచారం అభయారణ్యం ముఖ ద్వారం



పోచారం ప్రాజెక్టు మధ్యన ఐలాండ్ దృశ్యం



పోచారం అభయారణ్యంలో కృష్ణజింక



రన్నరప్‌గా గెలుపొందిన నిజామాబాద్ జట్టుకు కప్‌ను అందజేస్తున్న వొడితెల ప్రణవ్, ఏసీపీ శ్రీనివాస్‌జీ తదితరులు

హుజూరాబాద్‌లో రాష్ట్రస్థాయి హాకీ పోటీలు

● విజేతగా మెదక్.. రన్నరప్‌గా నిజామాబాద్ జట్టు

హుజూరాబాద్, మార్చి18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు చివరి రోజు మంగళవారం హోరాహోరీగా సాగాయి. క్రీడల్లో భాగంగా కరీంనగర్, మెదక్, హైద్రాబాద్, నిజామాబాద్ జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. మొదటి సెమీఫైనల్స్‌లో కరీంనగర్‌పై మెదక్ 3-1తో విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. రెండో సెమీఫైనల్స్ హైద్రాబాద్‌పై నిజామాబాద్ 1-0తో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. థర్డ్ ఫేస్ కోసం హైద్రాబాద్, కరీంనగర్ జట్లు తలపడగా ఇరుజట్లు చెరొక గోల్ చేయడంతో డ్రాగా ముగిసింది. ఎంపైర్లు స్ట్రోక్ ద్వారా విజేతను నిర్ణయించేందుకు ఇరుజట్ల కెప్టెన్లతో సంప్రదించి నిర్ణయం తీసుకున్నారు. హైద్రాబాద్‌లో 4గోల్స్ చేయగా, కరీంనగర్2 గోల్స్ చేయడంతో హైద్రాబాద్ గెలిచింది. ఫైనల్‌మ్యాచ్‌లో మెదక్- నిజామాబాద్ జట్లు పోటీపడగా 4-1తో మెదక్ విజయం సాధించి విజేతగా నిలిచింది. రన్న రప్‌గా నిజామాబాద్, మూడో స్థానంలో హైద్రాబాద్ సరిపెట్టుకుంది. గెలుపొందినజట్లకు హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, ఏసీపీ శ్రీనివాస్‌జీ, ఆర్గనైజర్లు బహుమతులు ప్రదానం చేశారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ముప్కాల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనకు ముప్కాల్ మండలంలోని కస్తూర్బా పాఠశాల ముప్కాల్, రెంజర్ల హైస్కూళ్లలో ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థులపై ప్రత్యేక దృష్టితో స్పెషల్ క్లాసులు నిర్వహించాలని ఆదేశించింది. ప్రతీ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రధానోపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో సెలబస్ పూర్తిచేసి ఉపాధ్యాయులు మూడుసార్లు రివిజన్ చేయించారు. ముప్కాల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలుకు దీటుగా పోటీపడుతున్నారు. ముప్కాల్ హైస్కూల్‌లో 109మంది విద్యార్థులు రెంజర్ల ప్రభుత్వ పాఠశాలల్లో 16మంది విద్యార్థులు, కస్తూర్బ పాఠశాలల్లో 41 మంది విద్యార్థులు పరీక్షకు సిద్ధమవుతున్నారు. పదవ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8గంటల నుంచి 9గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు ప్రత్యేక బోధన చేయడంతో ఉపాధ్యాయులు వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. పరీక్షలకు ఏలా సిద్దం కావాలో మేళకువలను నేర్పుతున్నారు. పరీక్షల సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలు వివరిస్తూ పరీక్షలంటే విద్యార్థులకు భయం కలుగకుండా మనోధైర్యాన్ని నూరి పోస్తున్నారు. ప్రతీ విద్యార్థి ఇచ్చిన ప్రశ్నకు జవాబు వస్తుందా లేదా తేల్చేందుకు సెలబస్ స్పెషల్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు పెట్టారు. పదవ తరగతి పరీక్షల్లో ప్రతీ విద్యార్థి అత్యధిక మార్కులు సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు వారిని సిద్ధం చేశారు.

టీయూలో బాలికలకు నూతన వసతి గృహం

నిర్మించేది ఎన్నడో?

● తెలంగాణ యూనివర్సిటీలో బాలికలకు వసతి కరువు ● ఒకే హాస్టల్ భవనంలో 500 మందికి వసతి

● 300 మందికి సరేపోయే భవనంలో 500 మంది.. ● ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు ● ప్రకటనకే పరిమితమైన నూతన వసతి గృహ భవన నిర్మాణం

డిచ్‌పల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణకు ముందే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం పేరుతో ఉన్న ఏకైక యూనివర్సిటీ ఈ డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీ. ఇంత ఘనమైన పేరున్న ఈ విశ్వవిద్యాలయంలో బాలికలు తీవ్రమైన వసతి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రం అవతరించి 11 ఏళ్లు గడిచినా వర్సిటీలో బాలికల వసతి సమస్య నేటికీ తీరడం లేదు. విద్యార్థులు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, రాష్ట్ర గవర్నర్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందించినా సమస్య పరిష్కరం కావడంలేదు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థినులు ఇక్కడికి పీజీ, ఉన్నత చదువుల కోసం వస్తుంటారు.

● ఎనిమిదేళ్లుగా వేధిస్తున్న సమస్య

గత 8 సంవత్సరాల కాలంగా ఈ హాస్టల్ సమస్య తీవ్రంగా వేధిస్తున్న ప్రభుత్వ, పెద్దలు, ఉన్నత విద్యామండలి స్పందించకపోవడంతో విద్యార్థినులు తీవ్రఇక్కట్లు పడుతున్నారు. పీజీ కోర్సుల్లో అన్నివిభాగాల్లో విద్యార్థినులే అధికశాతం సీట్లు పొందగా 100 శాతం సీట్లలో 72 మంది విద్యార్థినులే సీట్లు సాధిస్తున్నారని వర్సిటీ అధికారులే చెబుతున్నారు. వర్సిటీలోని బాలికల హాస్టల్‌లోని ఒక్కో గదిలో 5 నుంచి ఆరుగురు ఉండాల్సి ఉండగా 10 నుంచి 15 మంది సర్దుబాటు చేసుకుంటున్నారు. తెలంగాణ యూనివర్సిటీలో 1851 మంది విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరగా అందులో 1226 మంది బాలికలు పీజీ కోర్సులో ప్రవేశం పొందారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పీజీ కోర్సుల్లో బాలికలు ఎక్కువగా చేరుతుండటంతో హాస్టల్ వసతి ఇబ్బందిగా మారుతుంది. దీంతో యూనివర్సిటీ అధికారులు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులో చేరే విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించకుండా ఒత్తిడిని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. గత పదేళ్ల క్రితం 300 మంది కోసం నిర్మించిన బాలికల హాస్టల్‌లో ప్రస్తుతం 500 మంది ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కెమిస్ట్రీ, తెలుగు, ఇతర డిపార్టుమెంట్‌లలో 30 నుంచి 60 సీట్లకు పెంచిన హాస్టల్ వసతి మాత్రం పెంచడం లేదని దీంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని విద్యార్థినులు వాపోతున్నారు. గతంలో విశ్వవిద్యాలయానికి రాష్ట్ర గవర్నర్ హోదాలో ఉన్న తమిళిసై సౌందరరాజన్ సందర్శించి సమయంలో విద్యార్థులు బాలికల హాస్టల్ ఏర్పాటుచేయాలని ఆమెకు తమ గోడు వెళ్లబోసుకు న్నారు. వెంటనే సమస్యను పరిష్కరించేందుకు స్వయంగా హాస్టల్ సందర్శించిన గవర్నర్ హామీ ఇచ్చి ఏడాదిన్నర గడిచినా హాస్టల్ వసతి నిర్మాణానికి ముందడుగు పడలేదు. ఇప్పటికైనా జిల్లా శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, పార్లమెంట్ సభ్యుడు వసతి గృహం ఏర్పాటు పట్ల ప్రత్యేక చొరవ చూపాలని విద్యార్థినులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఫోకస్



టీయూ కళాశాల భవనం



టీయూ స్వాగత తోరణం



టీయూ బాలికల హస్టల్ ఇదే..

మంజూరైందని చెప్తున్నా పనుల ఊసే లేదు..

తెలంగాణ యూనివర్సిటీకి బాలికల హస్టల్ మంజూరు అయిందని వర్సిటీ అధికారులు చెబుతున్నా ఇంతవరకు పనులు ప్రారంభం కావడం లేదు. మంజూరు అ1యిందని చెబుతున్న కానీ ఆ వైపు ముందడుగు పడటం లేదని, చాలా రోజుల నుంచి అధికారులు ఇలాంటి ప్రకటనలు చేస్తూ కాలయాపన చేస్తున్నరని విద్యార్థి సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ డిపార్టుమెంట్ ల ద్వార వర్సిటీకి రెండు బాలికల హాస్టల్ మంజూరయ్యాయి. అందుకు సంబంధించి మంజూరు పత్రాలను ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా ఉన్న యాదగిరి నాటి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా రవీంద్రభారతిలో అం దుకున్నా రు. ఆ ఫైల్ ఎటుపోయిందో ఉన్నతాధికారులకే తెలియాలి.

నిర్మాణ పనులపై ఉన్నతాధికారులతో మాట్లాడుతా

● టీయూ వీసీ యాదగిరి రావు

రూసా ద్వారా హాస్టల్ నిర్మాణానికి నిదులు మంజూరయ్యాయి. త్వరలో టెండర్లు పిలుస్తాం. ఈ విషయంలో ఉన్నతాధికారులతో త్వరలో సమావేశమై చర్చిస్తా.

అనాథ వృద్ధులను ఆశ్రమంలో చేర్పించాలి

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, రెడ్‌క్రాస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మండలం రాంపూర్‌లో వృద్ధాశ్రమం అందుబాటులోకి తెచ్చామని, జిల్లాలో ఎక్కడైనా అనాథ వృద్ధులను గమనిస్తే రాంపూర్‌లోని వృద్ధాశ్రమంలో చేర్పించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు అందుబాటులో ఉంటే ఆరోగ్య సంబంధిత ఫైల్, సంబంధిత గ్రామ పంచాయతీ నుంచి అనాథ వృద్ధులే అని ధ్రువీకరణ పత్రం, వృద్ధులను వృద్ధాశ్రమంలో చేర్పించే వారి పూర్తి వివరాలు, ఫోన్ నెంబర్‌తో దరఖాస్తు చేయవచ్చన్నారు. వృద్ధాశ్రమంలో చేరే వారు 60 సంవత్సరాలు పైబడి, స్వస్థతతో ఉండి వారి పనులు వారే చేసుకునే విధంగా ఉండాలన్నారు. పై వివరాలతో జిల్లా వృద్ధుల శిశుసంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో కానీ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయం ఖలీల్‌వాడి లేదా రాంపూర్ వృద్ధాశ్రమంలో సంప్రదించాలన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నెంబర్ 9849933300, ఓల్డేజ్ హోమ్ కోఆర్డినేటర్ 9618844461 నెంబర్లను సంప్రదించాలన్నారు.

తలసేమియా బాధితులకు ఉచిత వైద్య సేవలు..

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిజామాబాద్ శాఖ భవనంలో తలసేమియా వ్యాధి రక్తమార్పిడికి రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రక్త మార్పిడి చేయబడుతుందని ఉచితంగా మందులు ఇవ్వనున్నామని కలెక్టర్ తెలిపారు. ఐదు సంవత్సరాల వయస్సు దాటిన తలసేమియా బాధితులు ఉచిత వైద్య సేవలు పొందేందుకు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు తప్పనిసరి అన్నారు. 5 ఏళ్లలోపు బాలలకు సంబంధించి వారి తల్లిదండ్రుల రేషన్ కార్డు, ఆధార్‌కార్డు తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఒకరోజు ముందు ఫోన్ చేసి బుకింగ్ చేసుకోవాలని ప్రస్తుతం మంగళ, గురు, శనివారాల్లో రక్త మార్పిడి ఉంటుందని సూచించారు.

వైద్య సేవల డిజిటలైజేషన్‌పై శిక్షణ

నిజామాబాద్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలోనూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందిస్తున్న సేవలను ఈహెచ్ఎంఐఎస్‌లో డిజిటలైజేషన్ చేయడంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ఐటీ రిలేటెడ్ పర్సన్‌లకు జిల్లా వైద్య ఆరోశ్య శాఖ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ మాట్లాడుతూ పీహెచ్‌సీలలో అందిస్తున్న సేవలో ఓపీ రిజిస్ట్రేషన్, మెడికల్ ఆఫీసర్ ఓపి, ల్యాబ్ టెక్నీషియన్ సేవలు, ఫార్మసిస్టు సేవలను నూతన డిజిటలైజేషన్ కార్యక్రమం ఈహెచ్ఎంఐఎస్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సపోర్ట్ ఇంజనీర్ పృథ్వీక, డీడీఎం నారాయణ, శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు 57 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించగా మొత్తం 16,766 మంది విద్యార్థులకు గాను 16,291 మంది హాజరుకాగా 475 మంది గైర్హాజరయ్యారు. 54 పరీక్షా కేంద్రాలను డీఐఈవో రవికుమార్, పరీక్షల నిర్వాహణ కమిటీ, ఫ్లయింగ్ సిట్టింగ్ స్క్వాడ్, హైపవర్ కమిటీలు తనిఖీ చేశారు. జిల్లాలో ఎక్కడ కూడా మాస్‌కాపీయింగ్ కేసు నమోదు కాలేదు.

అదనపు ఎస్పీగా ఏసీపీ శ్రీనివాస్‌రావుకు పదోన్నతి

నిజామాబాద్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలువురు ఏసీపీలకు అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర హోం శాఖ స్పెషల్ సెక్రెటరీ రవిగుప్త మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కమీషనరేట్‌లు, జిల్లాల విభాగాల్లో డీఎస్పీలుగా పనిచేస్తున్న వారికి నాన్ క్యాడర్ ఏఎస్పీలుగా పదోన్నతులు కల్పించారు. జిల్లాలో ఏసీపీ ఎస్బీగా పనిచేస్తున్న శ్రీనివాస్‌రావుకు పదోన్నతి లభించింది. వీరిని డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అతి త్వరలో వీరికి పోస్టింగ్‌లు ఇచ్చే అవకాశం ఉంది.

బార్దాన్ కార్మికుల కూలీ రేటు పెంచాలి

నిజామాబాద్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బార్దాన్ కార్మికుల కూలీ రేట్లను పెంచాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం శ్రద్ధానంద్ గంజ్‌లో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ బార్దాన్ కార్మికులకు కూలీ రేట్లు పెంచాలని గత మూడు సంవత్సరాలుగా జరిగిన ఒప్పందం ప్రకారమే వేతనాలు ఇస్తున్నట్లు అసోసియేషన్ నాయకులు చెబుతున్నా పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలన్నారు. బాల కార్మికులతో పనులు చేయించుకుంటున్న వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. అనంతరం లేబర్ కమీషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాములు, హిమామ్, విజయ్, గంగాధర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ ఏజెంట్ల మోసాలకు గురి కావొద్దు:ఎస్సై

ఇందల్వాయి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా గల్ఫ్ ఏజెంట్లు తయారయ్యారని గల్ఫ్ ఏజెంట్ల చేతిలో పడి యువకులు మోసపోవద్దని ఎస్సై మనోజ్‌కుమార్ అన్నారు. ఎలాంటి లైసెన్సు లేకుండా గల్ఫ్ వీసాల పేరుతో వివిధ దేశాల్లో అధిక జీతం ఉంటుందని నమ్మబలికి అమాయక ప్రజలను వలలో వేసుకొని లక్షలు వసూలు చేస్తున్న గల్ఫ్ ఏజెంట్ల పై చర్యలు తీసుకొని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోయి బాధితులు ఎవరైనా ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

'మాలలందరికీ చీకటి రోజు'

నిజామాబాద్‌అర్బన్, మార్చి 18(ఆంధ్రజ్యోతి):తెలంగాణలోనే మాల ప్రజాప్రతినిధులు ఎస్సీరిజర్వేషన్ స్థానాల్లో గెలుపొంది ఎస్సీరిజర్వే షన్‌ను అడ్డుకోలేకపోయారని ఇది మాలలందరికి చీకటి రోజు అని మాల మహానాడు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ కోకన్వీనర్ ఎడ్ల నాగరాజు అన్నారు.మంగళవారం అసెంబ్లీలో ఎస్సీవర్గీకరణ బిల్లుఆమోదంపై నగరంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్దనిరసన తెలిపారు.తెలంగాణలో ఎస్సీ జనాభా ప్రాతిపదికన 18శాతం రిజర్వేషన్లు సాధించడం కోసం ప్ర భుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు.మాలలప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్లే ఎస్సీవర్గీకరణ బిల్లుఅసెంబ్లీలో ఆమోదం పొందిందని విమర్శించారు.

6 నుంచి 9 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):మహాత్మ జ్యోతిభాపూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బీసీ బాల బాలికల పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి 6, 7, 8, 9 తరగతులలో మిగిలిపోయిన సీట్ల కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయకర్త సత్యనాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మరియు ఓసీ / ఈబీసీలకు చెందిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని ఏప్రిల్ 20న జరిగే ప్రవేశ పరీక్షలో ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. దరఖాస్తులను బీజేపిటిబిసిఅడ్మిషన్స్‌ఓఆర్‌జి వెబ్‌సైట్‌లో ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన కోరారు.

ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం 3వ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

డిచ్‌పల్లి,మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ లో పీజీ ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం 3వ సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. న్యాయ కళాశాలలో జరుగుతున్న ఈ పరీక్షలను వీసీ యాదగిరి రావు, ఆకస్మికంగా తనిఖీ చేశారు. 42 విద్యార్థులకు గాను 33మంది పరీక్షకు హాజరై 9మంది గైర్హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసన్నరాణి, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

పసుపు ధరపై ప్రశాంత్‌రెడ్డి, కవిత మాట్లాడటం సిగ్గుచేటు

● రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో పసుపు పంట సాగుపై మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత మాట్లాడటం సిగ్గుచేటని రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డిలు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీడ్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పసుపునకు మద్దతు ధర రావడం లేదని అసెంబ్లీలో ప్రశాంత్‌రెడ్డి, కౌన్సిల్‌లో కవితలు మాట్లాడారని వారి హయాంలో పసుపు రైతులను ఎందుకు విస్మరించారో జవాబు చెప్పాలన్నారు. పసుపు బోర్డు వచ్చిన ధర రావడం లేదని గతంలో కాంగ్రెస్ హయాంలో పసుపు పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత తమదన్నారు. బీఆర్ఎస్ హయాంలో పసుపు రైతులను పట్టించుకోలేదని పదేళ్ల పాటు అధికారంలో ఉండగా క్వింటాలుకు రూ.7 వేలు కూడా దాటలేదన్నారు. మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి హయాంలో పసుపు రైతులకు ఏం చేశారో జవాబు చెప్పాలన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే రైతులను జైల్లో పెట్టారని తనను కూడా పసుపు రైతుల గురించి ప్రశ్నిస్తే జైల్లో పెట్టిన విషయాన్ని అన్వే ష్‌రెడ్డి గుర్తు చేశారు. గత ఏడాది నుంచి రాష్ట్రంలో పసుపు ధర డబుల్ అయ్యిందని ఈ ధర కూడా సరిపోదని ఇంకా ధర పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ధరలు రాకపోవడానికి వ్యాపారులు సిండికేట్ కావడమే మరో కారణం అన్నారు.

బాగా ఎండిన పసుపునే మార్కెట్‌కు తీసుకురావాలి..

నిజామాబాద్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బాగా ఎండిన శుభ్రం చేసిన పసుపును మార్కెట్ యార్డుకు తీసుకురావాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, మార్కెటింగ్ శాఖ అదనపు సంచాలకులు రవి కుమార్, మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు మల్లేశంలు తెలిపారు. రైతులతో పసుపు ధరలపై వారు మాట్లాడారు. రైతులకు లాభదాయక ధర పొందడానికి బాగా ఎండిన పసుపునే మార్కెట్‌కు తీసుకురావాలన్నారు. మార్కెట్ యార్డుకు తాము పండించిన పసుపును ఒకేసారి తీసు కురాకుండా ధరలను గమనిస్తూ దశల వారీగా తీసుకురావాలని కోరారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ కార్యకలాపాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి గంగు బాయి, మార్కెటింగ్ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

'బీసీ బిల్లు ఆమోదం ఎమ్మెల్సీ కవిత సాధించిన విజయమే'



మాట్లాడుతున్న జాగృతి నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదం తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సాధించిన విజయమేనని తెలంగాణ జాగృతి జిల్లా నాయకులు అవంతిరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలి కమిషన్ రిపోర్టు వచ్చిన నాటినుంచి బీసీలకు జరిగిన అతిపెద్ద న్యాయం 42శాతం రిజర్వేషన్లను తెలంగాణ అసెంబ్లీలో బిల్లు పాసవ్వడమేనన్నారు. ఎమ్మెల్సీ కవిత పోరాటంతోనే రెండు వేరు వేరు బిల్లులు కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిందన్నారు. బీసీల కోసం ఎమ్మెల్సీ కవిత చేసిన ఉద్యమానికి ప్రభుత్వం తలొగ్గిందన్నారు. కుల గణన విషయంలో కాంగ్రెస్, బీజేపీలు ఇద్దరు బీసీలకు అన్యాయం చేయాలని చూసారన్నారు. బీసీ సంఘాలు తెలంగాణ జాగృతి వంటి సంస్థల ఒత్తిడి ఉద్యమంతోనే బీసీ రిజర్వేషన్‌లు కొలిక్కి వచ్చాయన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం రెండు వేరువేరు బిల్లు పెట్టడం ఎమ్మెల్సీ కవిత సాధించిన విజయమన్నారు. బిల్లు ప్రవేశపెట్టి చేతులు దులుపుకోకుండా కేంద్రం మీద ఒత్తిడి తెచ్చి రిజర్వేషన్లు సంపూర్ణంగా అమలయ్యే వరకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని పేర్కొన్నారు. రిజర్వేషన్లు సంపూర్ణంగా అమలయ్యే వరకు బీసీ సోదరుల పక్షాన జాగృతి ఉద్యమం కొనసాగతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ భరద్వాజ్, డాక్టర్ పులిజైపాల్, పంచరెడ్డి మురళి, సామల సాయికృష్ణ, హరీష్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

'పూటకో పార్టీ మారే దినేష్ ఎమ్మెల్యేపై మాట్లాడటం తగదు'



మాట్లాడుతున్న మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు పసుల శ్రీనివాస్

మోపాల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పూటకో పార్టీ మారే భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిపై విమర్శలు చేయడం మంచిదికాదని మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షులు పసుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మోపాల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి వైద్య వృత్తిని మానుకొని ప్రజలకు సేవచేయాలన్న ఉద్దేశ్యంతో రాజకీయంలోకి వచ్చిన ఆయనపై బురద జల్లడం సరికాదని అన్నారు. రాజకీయ గురువైన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్‌రావును, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌లకు వెన్నుపోటు పొడిచి భారతీయ జనతపార్టీలో చేరారని అన్నారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఇటుకబట్టీల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపించడం సరికాదన్నారు. ఆయన నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎంతో కృషిచేస్తున్నారని తెలిపారు. పదిహేను నెలల కాలంలోనే సుమారు రెండువందల ఐదు కోట్ల రూపాయలతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ, శంకుస్థాపనలు చేయడం జరిగిందన్నారు. మరో రెండువందల కోట్ల రూపాయలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను తెప్పించారని అన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే దినేష్ ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. మరోసారి ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. రూరల్ నియోజకర్గంలో ఉన్న ఇటుకబట్టిల యజమానులు దినేష్ తప్పుడు ప్రచారం చేస్తున్నాడని ప్రెస్‌మీట్ పెట్టి చెప్పడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ రమేష్, బాబు, ప్రవీణ్, లక్ష్మణ్, పోతన్న, రాములు, పోశెట్టి, తదితరులున్నారు.

'దినేష్ కులాచారిని విమర్శించేస్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదు'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయపై ఎమ్మెల్యే భూపతిరెడ్డిని నిలదీస్తే కాంగ్రెస్ నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారిపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ రూరల్ నియోజకవర్గ మండల అధ్యక్షులు పద్మారెడ్డి, కులాచారి శ్యాం, శంకర్ రెడ్డిలు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్ రెడ్డి, ప్రసాద్, వివిధ మండలాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సిరికొండ:అభివృద్ధి కోసం కలిసి పని చేద్దామని బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ అంటే ఆయనతో కలిసిరావాల్సింది పోయి వ్యక్తిగత దూషణలకు దిగడం బాధకరమని బిజెపి జిల్లా కార్యదర్శి నక్క రాజేశ్వర్ ఈ సమావేశంలో ఓబిసి రాష్ట్ర నాయకు లు రామ స్వామి, మండల అధ్యక్షులు సంజీవ్ రెడ్డి రాజే శ్వర్‌రెడ్డి, మాలవ త్‌రాజేందర్, బాబురావు, రాజేశ్వర్‌రెడ్డి, రంజిత్, గంగారెడ్డి,ప్రభాకర్‌పాల్గొన్నారు.

ఇందల్వాయి:పంటలు ఎండుతున్నా ఏ ఒక్కరోజైనా రైతు లను పరామర్శించని రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్, ఎంపీ అర్వి ంద్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటని బీజేపీ మండల అధ్యక్షుడు సత్యనారా యణ అన్నారు. మండల కేంద్రంలోని గౌడసంఘంలో మంగళవారం సమా వేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లోలం సత్యనారాయణ, గన్నారం తదితనేలే పాల్గొన్నారు.

కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం

సుభాష్‌నగర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు యూనివర్సిటీకి ఉన్న పొట్టి శ్రీరాములు పేరును మార్చడాన్ని నిరసిస్తూ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు పేరు మార్చడం జాతికే అవమానమన్నారు. తెలుగు ప్రజల ఆశాజ్యోతి పొట్టి శ్రీరాములన్నారు. తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా ఆమరణ నిరాహార దీక్ష చేసి జాతికి గౌరవం తెచ్చాడన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగం మరిచిపోలేని చరిత్ర అన్నారు.స్వాతంత్ర్య పోరాటంలో గాంధీతో కలిసి పనిచేసి ఖాది ఉద్యమం, ఉప్పుసత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సం ఘం అధ్యక్షులు ఇల్లెందుల ప్రభాకర్, పట్టణ అధ్యక్షులు వీరశేఖర్, గరిపెల్లి ప్రవీణ్ కుమార్, యంసాని రవి, నార్ల రమేష్,ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

బోధన్ వాసికి సీవీ రామన్ అకాడమీ అవార్డు



అవార్డు అందుకుంటున్న మాశెట్టి నర్సయ్య

బోధన్‌రూరల్,మార్చి18(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మాశెట్టి నర్సయ్యకు సీవీ రామన్ అకాడమీ సేవా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రావు నిర్వహించిన బెస్ట్ బిజినెస్ సేవా అవార్డును ప్రముఖ వ్యాపారవేత్త మాశెట్టి నర్సయ్యకు మంగళవారం అందజేశారు. హైదరాబాద్‌లోని హరిహర కళా భవన్‌లో ఆయన చేసిన సేవలను గుర్తించి సువర్ణ గంట, కంకణ, గోల్డ్ మెడల్స్‌ను ప్రదానం చేశారు. మాశెట్టి నర్సయ్యను పట్టణ ప్రముఖులు తదితరులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడి మృతి

నిజామాబాద్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజుల క్రితం నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లో సైకిల్‌పై వెళ్తూ కారు ఢీకొట్టడంతో గాయపడిన బాలుడు సయ్యద్ షాహిజాద్ (11) మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. రోడ్డుపై సైకిల్‌పై వెళ్తున్న షాహిజాద్‌ను తప్పించబోయి కారు అదుపుతప్పి సైకిల్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడగా నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ షాహిజాద్ మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటనలో కారు ఆరు పల్టీలు కొట్టగా కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ఘటనపై షాహిజాద్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు.

ప్రతి వాడను అభివృద్ధి చేస్తాం

ఇందల్వాయి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సహకారంతో ప్రతి వాడను అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మండలంలోని నల్లవెల్లి గ్రామంలో రూ.15లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ఎంపీడీవో అనంత్‌రావు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనంత్‌రావు, పార్టీ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, సంతోష్‌రెడ్డి, దండ్ల రాజన్న, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు, పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



ఈద్గాలో పరిశీలిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,మార్చి18(ఆంధ్రజ్యోతి): రాబోయే పండుగలు రంజాన్, ఉగాది, శ్రీరామ నవమి పండుగను ప్రజలందరు కలిసిమెలిసి ప్రశాంతంగా జరుపుకోవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని ఈద్గాను పరిశీలించి రంజాన్ పండుగ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం శక్కర్‌నగర్ చౌరస్తాలో వాటర్ లీకేజీ మరమ్మత్తు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వేసవిలో ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, మున్సిపల్ డీఈ విఘ్నేష్, ఈద్గా కమిటీ సభ్యులు, మైనారిటీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణం

నిజామాబాద్ కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేదపండితుల మంత్రోచ్ఛారణలతో భక్తుల లక్ష్మీనారసింహస్వామి గోవింద నామస్మరణల మధ్య కల్యాణోత్సవం ఘనంగా సాగింది. మంగళవారం స్థానిక బ్రహ్మపురి లోని లక్ష్మీనారసింహాస్వామి దేవాలయంలో కల్యాణోత్స వాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోవర్ధనం సందీప్ కుమార్, నరేందర్, జనార్ధన్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

● డిచ్‌పల్లి డీఈ ఉత్తమ్ జాడే

డిచ్‌పల్లి,మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం దృష్ట్యా రైతుల పంట పొలాలకు,ఇండ్లలో కరెంట్ సమస్యలు ఉత్పన్నం గాకుండా చర్యలు తీసుకుంటామని డిచ్‌పల్లి ట్రాన్స్‌కో డీఈ ఉత్తమ్‌జాడే అన్నారు. మంగళవారం దూస్ గాం 33.11సబ్‌స్టేషన్‌లో రూ.10లక్షల విలువ గల బ్రేకర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ... ఈ బ్రేకర్ తో విద్యుత్ సరఫరా మెరుగు పడుతుందని రైతుల పంట పొలాల మోట ర్లకు నాణ్యమైనవిద్యుత్ అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ శ్రీనివాస్,ఏఈగంగారాం,స్వామిదాస్,నరేశ్,ఖాజా,వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

గిరిరాజ్‌లో రసాయన శాస్త్రకార్యశాల

నిజామాబాద్ అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర అంతర్గత నాణ్యత నిర్ధారణ విభాగం సంయుక్తంగా పరిశోధన పద్ధతులు, సమాచార వ్యక్తీకరణ పద్ధతులు అనే అంశంపై మంగళవారం డిగ్రీ, పీజీ విద్యార్థులకు కార్యశాల నిర్వహించారు. ఈ సదస్సులో ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి, తెలంగాణ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ నాగరాజు, బాసర ట్రిబుల్ ఐటీ ప్రొఫెసర్ రఫీక్ తదితరులు పాల్గొని పరిశోధన పద్ధతులకు సంబంధించి ప్రాథమిక అంశాలను, వివరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రంగరత్నం, రాజేష్, పాల్గొన్నారు.

వార్షికోత్సవ వేడుకలకు శ్రీకృష్ణ ఆలయం ముస్తాబు

డిచ్‌పల్లి,మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లి గ్రామంలో శ్రీకృష్ణ ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 20 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. పాల్గుణమాసంలో జరిగే ఈ వేడుకలకు ఇస్కాన్ టెంపుల్ కంఠేశ్వర్ కృష్ణ గానమృతం కార్యక్రమాలు జరుగుతాయని భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నమని నిర్వాహకులు తెలిపారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.230	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.89,700	రూ.82,800	రూ.1030

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : చావా (తెలుగు) (10.00, 4.15)
: ఆఫీసర్ ఆన్ డ్యూటీ (1.20)
: కోర్టు (7.35, 10.40)
స్క్రీన్-2 : కోర్టు (10.00, 4.25)
: చావా (తెలుగు) (1.05, 7.30)
: చావా (హిందీ) (10.50)
స్క్రీన్-3 : చావా (హిందీ) (10.30, 1.50)
: ల్యాంప్ (5.10)
: రిటర్న్ ఆఫ్ ది డ్రాగెన్ (తెలుగు) (7.35)
యుగానికి ఒక్కడు (10.45)
స్క్రీన్-4 : దిల్‌రూబా (10.15, 4.10, 7.20, 10.30)
1000 వాలా (1.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : దిల్‌రూబా (11.00)
: కోర్టు (1.45, 7.20, 10.20)
: యుగానికి ఒక్కడు (4.40)
స్క్రీన్-2 : యుగానికి ఒక్కడు (11.00)
: చావా (హిందీ) (1.40)
: దిల్‌రూబా (4.35, 7.30, 10.30)
స్క్రీన్-3 : ఆఫీసర్ ఆన్ డ్యూటీ (1.30, 7.30)
: చావా (తెలుగు) (4.30, 10.20)

దేవి : దిల్‌రూబా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : యుగానికి ఒక్కడు (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : చావా (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: కోర్టు (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్